సాక్షి మంచిర్యాల

జలసవ్వడి.. జనసందడి

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన జలపాతాల వద్ద ఆదివారం జనసందడి నెలకొంది. వర్షాలు తగ్గడం, ఆదివారం సెలవు కావడంతో ఉమ్మడి జిల్లాలోని జలపాతాలకు సందర్శకులు పోటెత్తారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. - వివరాలు 8లో



గరిష్టం/కనిష్టం 31.3 /26.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

సోమవారం । 31 । జూలై । 2023

న్యూస్‌రీల్

జైపూర్‌లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జైపూర్: జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 7న హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి మారయ్య తెలిపారు.

డీఐఈవో కార్యాలయ ఉద్యోగులపై వేటు

మంచిర్యాలఅర్బన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయం(డీఐఈవో)లో విధులు నిర్వహించే ఇద్దరు ఉద్యోగులపై వేటుపడింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒకరిని సస్పెండ్ చేయగా, మరొకరిని బదిలీ చేశారు. కార్యాలయంలో స్టెనో రమేశ్, ఏవో జి.సుందర్ రాఘవ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పలుమార్లు డీఐఈవో శైలజ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అయినా మార్పు రాకపోవటంతో ఉన్నతాధికారులకు నివేదించారు. ఈమేరకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఏవో సందీప్ రాఘవను జనగాంకు బదిలీ చేశారు. స్టెనో రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంపై డీఐఈవో శైలజను సంప్రదించగా ఉద్యోగులపై వేటు వాస్తవమే అని తెలిపారు.

సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూ కృషి

- జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి



మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

జన్నారం: సీపీఎస్ రద్దు చేయడంతోపాటు పాత పెన్షన్ విధానం అమలుకు ప్రభుత్వంపై పీఆర్టీయూ ఒత్తిడి పెంచుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. జన్నారంలోని పీఆర్టీయూ భవన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ పని చేస్తుందని పేర్కొన్నారు. ఐఆర్‌తో కూడిన పీఆర్సీ ఇప్పించేందుకు పీఆర్టీయూ కృషి చేస్తోందని చెప్పారు. 317 జీవో ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ వర్తింపజేసేలా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి నగూరి సత్యనా రాయణ, సంఘ నాయకులు విజయ్‌కుమార్, చిన్నయ్య, కిషన్, శేఖర్, నర్సయ్య, శ్రీని వాస్, రాంరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకోవాలి



మహిళా రైతులతో మాట్లాడుతున్న భాస్కర్

కోటపల్లి: కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునిగిన రాంపూర్, దేవులవాడ, కొల్లూర్, లక్ష్మీపూర్ గ్రామాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గం భాస్కర్ కోరారు. లక్ష్మీపూర్, దేవులవాడ, రాంపూర్, కొల్లూర్ గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఆదివారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో నాలుగేళ్లుగా పంటలు మునుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా లక్షల రూపాయలు నష్టపోతున్నా ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, చెన్నూరి రాజేశ్, పాతర్ల నాగరాజు, మహేశ్, సుధాకర్, సమ్మయ్య, సత్యాగౌడ్, రమేశ్, పురుషోత్తం, సంపత్, నరేందర్, కృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై విమర్శలు సరికాదు

చెన్నూర్: రేవంత్‌రెడ్డిని విమర్శించేస్థాయి ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు లేదని, చిల్లర విమర్శలు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి బోడ జనార్దన్ హెచ్చరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకుగురైన సుందరశాల గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. అనంతరం చెన్నూర్‌లో మాట్లాడారు. వర్షాలకు వందల ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు నష్టపోతే చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కనీసం పరామర్శించలేదని పేర్కొన్నారు. రైతులపై ఆయనకు ఉన్న ప్రేమకు ఇదే నిదర్శనమన్నారు. నియోజకవర్గంలోని వనరులను సుమన్, రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకుంటున్నారని ఆరోపించారు. మహ్మద్ బషీరొద్దీన్, చల్లా భాస్కర్‌రెడ్డి, పురుషోత్తం, లక్ష్మణ్, సమ్మిరెడ్డి, ఈర్ల నారాయణ, ఎండీ.హాజు, ఖలీల్, రాకేశ్, రమేశ్, రాజమల్లు, శ్రీను పాల్గొన్నారు.

చీట్‌ఫండ్స్

- చిట్టీల పేరుతో టోకరా
- రూ.కోట్లతో ఉడాయిస్తున్న నిర్వాహకులు
- ఆశపడి మోసపోతున్న అమాయక ప్రజలు



మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి విజయ్‌కుమార్ 2016 నుంచి చిట్టీలు నిర్వహిస్తున్నాడు. 2022 వరకు బాగానే నిర్వహించాడు. చాలా నమ్మకంగా వ్యాపారం చేశాడు. దీంతో మంచిర్యాల, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, సీసీసీ, నస్పూర్ ప్రాంతాలకు చెందినవారు విజయ్‌కుమార్ వద్ద చిట్టీలు వేశారు. కొంతకాలం తర్వాత చిట్టీలు ఎత్తుకున్నవారు తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో విజయ్‌కుమార్ రూ.1.50 కోట్ల చిట్టీ డబ్బులు వసూలు చేసి 2023, జనవరిలో ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విజయ్‌కుమార్‌ను కటకటాల్లోకి పంపించారు.

చెన్నూర్ పట్టణంలో ఓ చిట్‌ఫండ్ కంపెనీ ఏర్పాటు చేశారు. ఇందులో మొదట యజమాని రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షల చిట్టీలు నిర్వహించాడు. పట్టణానికి చెందిన చిరు వ్యాపారులు మొదలుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సైతం సభ్యులుగా చేరారు. చిట్స్ యజమాని మొదటి సంవత్సరం డ్రా పద్ధతిలో డబ్బులు చెల్లించాడు. ఏడాది తర్వాత పాట నిర్వహించాడు. ఓ ఏడాదిపాటు ఎవరికీ అనుమానం కలుగకుండా నిర్వహించడంతో సభ్యుల సంఖ్య పెరిగింది. ఏమైందో ఏమో.. 2021, మార్చి 27న చిట్ ఫండ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. నిర్వాహకుడు రూ.కోటితో ఉడాయించాడు.



మంచిర్యాలక్రైం: నమ్మకం లేనివారిని నమ్మించడం.. వారిని మోసం చేయడం చాలా కష్టం. నమ్మిన వారిని అయితే సులభంగా మోసం చేయవచ్చు. జిల్లాలో చిట్‌ఫండ్ నిర్వాహకులు ఇదే సూత్రాన్ని నమ్ముతున్నారు. మొదట నమ్మకంగా చిట్స్ నిర్వహిస్తూ.. సభ్యులకు నమ్మకం కుదిరాక కష్టమర్ల డబ్బులతో ఉడాయిస్తున్నారు. కొందరు చిట్టీల వ్యాపార భాగస్వామ్యం అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు ఫైనాన్స్ పేరిట అధిక లాభాల ఆశ చూపి మోసం చేస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

చిట్స్ నిర్వహించాలంటే ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. జిల్లాలో చాలా మంది అనుమతులు లేకుండానే చిట్టీల వ్యాపారం చేస్తున్నారు. భారీగా లాభాలు గడిస్తున్నారు. కోట్లకు పడగలెత్తుతున్నారు. తొలుత మాయమాటలు చెప్పి తమ వ్యాపారంలో సభ్యులుగా చేర్చుకుంటున్నారు. ప్రారంభంలో నమ్మకంగా ఉంటున్నారు. ఏడాది రెండేళ్లు గడిచాక పెద్ద మొత్తంలో డబ్బులు జమ చేసుకుని బిచాణా ఎత్తేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనల ప్రకారం ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నడిపించేందుకు చట్టప్రకారం అనుమతులు ఉండాలి. ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా లైసెన్స్ పొందాలి. అనుమతి లేకుండా నిర్వహించే చిట్టీలు, వడ్డీ వ్యాపారం చట్టవిరుద్ధం. కానీ జిల్లాలో కొందరు వ్యాపారులు ఎలాంటి లైసెన్స్ లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా రూ.కోట్లల్లో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. అనుమతులు పొందిన చిట్‌ఫండ్ కంపెనీలు సైతం నిబంధనలు ఉల్లంఘిస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి.

భవిష్యత్తు అవసరాల కోసం...

భవిష్యత్తు అవసరాల కోసం మధ్యతరగతి ప్రజలు చిట్స్‌ఫండ్ కంపెనీలలో, తెలిసినవారి వద్ద చిట్టీలు వేస్తున్నారు. ఇలా జమ చేసిన మొత్తాన్ని పాట రూపంలో ఎవరి అవసరాన్ని బట్టి వారు తీసుకుంటారు. పాట పోను మిగిలిన డబ్బులను పాట పాడిన వ్యక్తికి అప్పగిస్తారు. ఇలా కొన్నాళ్లు బాగానే నిర్వహిస్తున్నారు. నమ్మకం కుదిరాక.. సభ్యులు పెరిగాక వ్యాపారం విస్తరిస్తున్నారు. పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో చిట్టీలు ఎత్తుకున్నవారు డబ్బులు చెల్లిచకుంటే ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణంగా ఎవరికీ చెప్పకుండా వచ్చిన డబ్బులు తీసుకుని ఉడాయిస్తున్నారు. కొందరు కోట్ల రూపాయలు వసూలు చేసుకుని బిచాణా ఎత్తేస్తున్నారు. తర్వాత బాధితులకే ఐపీలు పంపిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అనుమతులు లేని చిట్‌ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ సంస్థలతో అప్రమత్తంగా ఉండాలి. డబ్బులను బ్యాంకుల్లో, పోస్టాఫీస్ ప్రభుత్వ సంస్థల్లో సేవింగ్ చేసుకోవాలి. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల యజమాన్యాలు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దు. ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలు వసూల్ చేసినా, వేధించినా మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– బి.తిరుపతిరెడ్డి, ఏసీపీ, మంచిర్యాల

మనువాదం అమలుకు కేంద్రం కుట్ర



అభివాదం చేస్తున్న 'భారత్ బచావో' నాయకులు

మందమర్రిరూరల్: దేశంలో రాజ్యాంగాన్ని రద్దు చేసి మనువాదాన్ని అమలు చేయడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్ర చేస్తోందని భారత్ బచావో కమిటీ అధ్యక్షుడు గాదె ఇన్నయ్య ఆరోపించారు. మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనువాదం సిద్ధాంతం అమలు దేశానికి పెనుప్రమాదమన్నారు. రాజ్యాంగంతోనే ప్రజలకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించేందుకే భారత్ బచావో ఏర్పాటు చేశామని తెలిపారు. అంతకుముందు మణిపూర్ ఘర్షణల్లో మృతిచెందినవారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సదస్సులో సీనియర్ ప్రొఫెసర్ రమేశ్‌పట్నాయక్, భారత్ బచావో కమిటీ జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, సభ్యులు రమేశ్, ఇబ్రహీం, వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు దాసారపు శ్రీనివాస్, దుర్గం నరేశ్, నీరటి రాజన్న, లక్ష్మణ్, రాంబాబు, పాషా, శ్రీనివాస్, వినోద తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి



జైపూర్: భారీ వర్షాలతో నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి ఆదివారం శాంతించింది. జైపూర్ మండలం వేలాల గ్రామం చేరిన వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. పార్వతి బ్యారేజీ 74 గేట్లు ఎత్తడం, ఎల్లంపల్లి నుంచి భారీగా దిగువకు నీరు రావడంతో శనివారం వరకు గోదారి తీర ప్రాంతం సముద్రాన్ని తలపించింది.

రూ.లక్ష సాయం అందేదెన్నడో?

- నెల క్రితమే దరఖాస్తు ప్రక్రియ పూర్తి..
- లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

దండేపల్లి: కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని ఇటీవల ప్రవేశపెట్టింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ పథకాన్ని జూన్ 9న మంచిర్యాలలో సీఎం కేసీఆర్ ప్రారంభించారు. దీంతో బీసీ చేతివృత్తిదారుల్లో సంతోషం వ్యక్తమైంది. పథకం ద్వారా సాయం పొందేందుకు అర్హులు ఆన్‌లైన్ ద్వారా జూన్ 20 వరకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆర్భాటం తప్ప ఆచరణ లేకపోవడంతో దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చూపిన హడావుడి లబ్ధిదారులకు సాయం అందించడంపై చూపడం లేదని దరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు. జూలై 15వ తేదీ నుంచే అర్హులకు చెక్కులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తు చేసుకుని నెల గడిచినా జిల్లాలో చెక్కుల పంపిణీ ప్రారంభించలేదు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

రూ.లక్ష సాయం కోసం జూన్ 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో జిల్లాలో 11,106 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సర్వే చేసిన అధికారులు 7,700 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో నిబంధనల ప్రకారం లేని 4,700 మందిని తొలగించారు. 3 వేల మందిని అర్హులుగా గుర్తించారు. తొలి విడతగా నియోజకవర్గానికి 300 మందికి ఇస్తామని తెలిపారు. తర్వాత 50 మందికి ఇస్తామని పేర్కొన్నారు. కానీ, ఒక్కరికీ అందలేదు.

ఇంకా సమయం పట్టొచ్చు..

రూ.లక్ష ఆర్థికసాయం చెక్కుల పంపిణీకి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ వర్షాల కారణంగా పంపిణీ ఆలస్యం అయింది. ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. త్వరలో ప్రక్రియను ప్రారంభించి అర్హులకు చెక్కులు అందిస్తాం.

– వినోద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి

పథకంపై పుకార్లు..

మొదటి విడతలో అందించే 300 మందికి సంబంధించిన జాబితా, వారికి సంబంధించిన చెక్కులు ఇంకా సిద్ధం కాలేదు. గ్రామాల్లో మాత్రం దీనిపై అనేక పుకార్లు మొదలయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన జాబితాలు ఇంకా ఎమ్మెల్యేల వద్దనే ఉన్నాయని, కలెక్టర్ ద్వారా సంబంధిత మంత్రి ఆమోదం పొందిన తర్వాత చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొంటున్నారు. మరో వైపు చెక్కుల పంపిణీకి అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పర్సంటేజీలు ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో ఫిఫ్టీ.. ఫిఫ్టీ పార్ములా అమలు చేస్తున్నట్లు సమాచారం. మొదటి విడత వచ్చిన చెక్కులను రూ.50 వేల చొప్పున ఇద్దరికి పంపిణీ చేసేలా ఒప్పిస్తున్నట్లు తెలిసింది. రెండో విడత చెక్కు వచ్చిన తర్వాత మళ్లీ రూ.50 వేల చొప్పున పంచుకునేలా అగ్రిమెంట్ చేస్తున్నట్లు ప్రచా రం జరుగుతోంది. ప్రభుత్వం అందించే రూ,లక్ష సాయం త్వరగా ప్రారంభించాలని, నిరంతరాయంగా కొనసాగించాలని, కొత్తవారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

నెరవేరనున్న చెన్నూర్ ప్రజల కల

- ఆర్టీసీ డిపో నిర్మాణానికి శంకుస్థాపన
- రెండు నెలల్లో పనులు పూర్తి చేయిస్తాం
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నేరవేరే సమయం ఆసన్నమైందని, రెండు నెలల్లో ఆర్టీసీ డిపో నిర్మాణం పూర్తి చేయిస్తామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలో గెర్రెకాలనీలో ఆర్టీసీ డిపో నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డిపో కోసం ప్రజలు ఎన్ని ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అడిగిన వెంటనే డిపో నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో చెన్నూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిందని తెలిపారు. ఇప్పటికే రూ.168 కోట్ల నిధులతో చెన్నూర్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. వర్షాకాలం ముగిసిన వెంటనే రూ.1,658 కోట్ల నిధులతో లక్ష ఎకరాలకు సాగు నీరందించే చెన్నూర్ లిఫ్ట్ పనులతోపాటు రూ. 500 కోట్లతో నియోజకవర్గంలో నిర్మించనున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తామన్నారు. డిపో నిర్మాణం పూర్తయితే చెన్నూర్ కేంద్రంగా మంచిర్యాలతోపాటు కోటపల్లి, వేమనపల్లి, నెన్నల, భీమిని, కన్నెపల్లి, కాళేశ్వరం, మహాదేవపూర్, కాటారం, గోదావరిఖని, పెద్దపల్లి, ఆదిలాబాద్, బాసర వరకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ మోతె తిరుపతి, సురేఖ, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భూమి ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటాం..



మాట్లాడుతున్న బొగె రాజేశ్వరి

చెన్నూర్‌లో బస్సు డిపో నిర్మాణానికి అధికారులకు నిరుపేదలైన తమ భూమే దొరికిందా అని పట్టణానికి చెందిన దళిత మహిళలు బొగె మల్లేశ్వరి, రాజేశ్వరి ప్రశ్నించారు. పట్టణంలోని సర్వే నంబర్ 869/28/1లో 70 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తమ అత్తగారైన బొగె లక్ష్మికి మూడెకరాలు కేటాయించిందని తెలిపారు. లక్ష్మి ముగ్గురు కొడుకులు అనారోగ్యంతో మృతి చెందడంతో మూడెకరాల్లో చాలావరకు ఆక్రమణకు గురైందని, మిగిలిన 1.20 ఎకరాలను కూడా అధికారులు లాక్కుని డిపోకు కేటాయించారని వివరించా రు. భూమికి బదులు భూమి ఇస్తామని చెప్పిన తహసీల్దార్ ఇప్పుడు తమకు సమాచారం ఇవ్వకుండా భూమిపూజ చేయించారని ఆరోపించా రు. తమ బాధను ఎమ్మెల్యేకు చెప్పుకుందామని వస్తే పోలీసులు అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు భూమి కేటాయించకుంటే.. డిపో నిర్మించే స్థలంలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనం



మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1988–89లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయుడు వీఎల్ నర్సింహరావు, ఉపాధ్యాయుడు శంకర్, నారాయణరెడ్డి, మనోహర్, శ్రీనివాస్, మధు రాబాయిలను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థుల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రఘువీర్, బొలిశెట్టి కిషన్, కొత్త శ్రీనివాస్, మహేష్, సుశీల్, అనిల్, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి 'గండి'

- భారీ వర్షాలతో తగ్గిన రాబడి
- పలు రూట్లలో రోడ్లు ఛిద్రం
- అటువైపు బస్సుల రాకపోకలకు బ్రేక్
- పడిపోయిన ఆక్యుపెన్సీ రేషియో



మంచిర్యాల డిపోలో బస్సు..

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదిరోజుల పాటు కురిసిన వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వరదల తాకిడికి లోలెవెల్ వంతెనలు, రహదారులు కొట్టుకుపోయాయి. మారుమూల ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. రవాణా వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ఆర్టీసీ కూడా బస్సులను ఆయా గ్రామాలకు నడపలేని పరిస్థితి తలెత్తింది. పల్లెజనం కూడా రాకపోకలపై ఆసక్తి చూపకపోవడంతో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పడిపోయింది. ఫలితంగా రీజియన్ వ్యాప్తంగా సంస్థ ఆదాయానికి గండి పడింది.

తెగిన వంతెనలు.. నిలిచిన బస్సులు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారులు కోతకు గురయ్యాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో సంబంధిత రూట్లలో నడిచే పల్లె వెలుగు సర్వీసులకు బ్రేక్ పడింది. అయినా ఆర్టీసీ పలు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సేవలందించింది. ఆదిలాబాద్ డిపో పరిధిలో తలమడుగు మండలం భరంపూర్ వద్ద రోడ్డు కొట్టుకుపోగా రుయ్యాడి మీదుగా సర్వీసును నడిపారు. అయితే పూర్తిస్థాయిలో బస్సులు నడపకపోవడం, పలు రోడ్లలో నడిచినా ప్రయాణికులు లేక ఆర్టీసీ ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపింది.

ఖాళీగా బస్టాండ్లు..

సాధారణ సమయాల్లో ప్రయాణికులతో కిటకిటలాడే ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ బస్‌స్టేషన్లలో ప్రస్తుతం రద్దీ కనిపించడం లేదు. వరదల ప్రభావం కారణంగా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోవడంతో సర్వీసుల సంఖ్యను కుదిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రీజియన్ వ్యాప్తంగా పలు రూట్లలో నిలిపివేసిన సర్వీస్‌లను ఇంకా పునరుద్ధరించలేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహించడంతో మహారాష్ట్ర వైపు వెళ్లే పలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే భైంసా డిపో పరిధిలో మాటేగాం, నిర్మల్, నిజామాబాద్ వైపు సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు.

పడిపోయిన ఓఆర్

వర్షాలు, వరదల ప్రభావంతో రీజియన్ వ్యాప్తంగా బస్సులు గడిచిన పది రోజుల్లో 12,700 కిలోమీటర్లు తక్కువగా తిరిగాయి. ఆదిలాబాద్, భైంసా, మంచిర్యాల డిపోల పరిధిలో 3 వేల కిలోమీటర్ల చొప్పున తిరగలేకపోయాయి. ఆసిఫాబాద్‌లో రెండువేల కిలోమీటర్లు, నిర్మల్‌లో 1,500 కిలోమీటర్లు, ఉట్నూరులో 200 కిలోమీటర్ల మేర బస్సు సర్వీసులు తక్కువగా తిరిగాయి. అలాగే కిలోమీటర్‌కు వచ్చే ఆదాయం (ఈపీసీ) ఆదిలాబాద్‌లో రూ.8, మంచిర్యాలలో రూ.8, ఆసిఫాబాద్ రూ.7, నిర్మల్ 6, భైంసా రూ.6, ఉట్నూర్‌లో రూ.6 మేర నష్టం వాటిల్లింది. ఇక ఓఆర్ విషయానికి వస్తే రీజియన్ వ్యాప్తంగా 10 నుంచి 13 పాయింట్లు తగ్గిపోవడం ఆదాయంపై ప్రభావం చూపింది.

ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)

డిపో	10 రోజుల క్రితం	ప్రస్తుతం
ఆదిలాబాద్	64	52
నిర్మల్	66	56
భైంసా	65	55
ఆసిఫాబాద్	66	53
ఉట్నూర్	58	48
మంచిర్యాల	69	56

గమ్యస్థానాలకు చేర్చడానికి కృషి చేశాం



భారీ వర్షాలతో ఆర్టీసీకి ఆదాయం తగ్గిన మాట వాస్తవమే. ఏకధాటిగా కురిసిన వానలతో పలు రూట్లలో బస్సులు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో ఆదాయం తగ్గింది. పలు ప్రాంతాల్లో రహదారులు తెగినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణికుల ను గమ్యస్థానాలకు చేర్చడానికి కృషి చేశాం.

– సోలోమాన్, ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం

రీజియన్ పరిధిలో డిపోల వారీగా వారం రోజులుగా వచ్చిన ఆదాయం వివరాలు (రూ.లక్షల్లో)..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల	ఉట్నూర్
23	13	8	18	9	20	2.50
24	20	17	26	11	25	3.60
25	20	10	24	11	22	3.20
26	21	10	22	11	22	3.50
27	16	1.50	13	11	20	2.60
28	15	2.60	15	12	24	2.70
29	16	6	18	10	20	2.40

జలసవ్వడి.. జనసందడి

- జలపాతాలకు సందర్శకుల తాకిడి
- సెలవు రోజు కావడంతో భారీగా తరలివచ్చిన పర్యాటకులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. అందులో భాగంగానే ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతాలకు వరద తాకిడి పెరిగింది. దీంతో జలసౌందర్యం వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పలువురు కుటుంబ సమేతంగా జలపాతాలను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పచ్చని ప్రకృతి.. పరవళ్లు తొక్కుతున్న జలపాతాల వద్ద ఆనందంగా గడిపారు. అయితే జలపాతాల వద్ద పర్యాటకుల సందడి పెరుగుతున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని, కనీస వసతులు కల్పించాలంటున్న సందర్శకుల మాటల్లోనే..



కుంటాల జలపాతం అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

ర్యాలీ గ్రామంలో..

- ఇటీవల వెలుగులోకి వచ్చిన వైనం
- 'సాక్షి' పత్రిక, సోషల్ మీడియాలో వైరల్
- జలపాతానికి పోటెత్తుతున్న పర్యాటకులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలంటూ డిమాండ్



ర్యాలీ గ్రామ శివారులోని జలపాతం వద్ద సందర్శకుల సందడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా కేంద్రానికి దాదాపు 20 కిలో మీటర్ల దూరంలోని ర్యాలీ గిరిజన గ్రామ శివారులోని ఓ జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మూడేళ్ల కిందట స్థానికులు గుర్తించినా పెద్దగా వెలుగులోకి రాకుండా ఉండిపోయింది. గత వారం 'సాక్షి' దినపత్రికలో దీనిపై కథనం ప్రచురితమైంది. ఇంకేముంది పర్యాటకులు వందల సంఖ్యలో జలాపాతాన్ని సందర్శిస్తూ తన్మయత్వం పొందుతున్నారు.



జలపాతం వద్ద సందర్శకుల జోష్

సౌకర్యాలు కల్పించాలి




చింతలమాదర జలపాతం వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు



చింతల మాదర జలపాతానికి యేటా వస్తుంటాం.. అక్కడి నిర్వాహకులు సందర్శకుల నుంచి ఎంట్రీ ఫీజు తీసుకుంటున్నారు. కానీ ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదు. ఫ్యామిలీతో వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జలపాత సమీపంలో మహిళలు బట్టలు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయాలి.

– పోడుపుగంటి సాయి, ఆసిఫాబాద్



గుండాల జలపాతం

జలధారల వరకు వెళ్లనిస్తే బాగుండేది..



హైదరాబాద్ నుంచి వచ్చిన పర్యాటకులు

నేరడిగొండ: కుంటాల జలపాతం గురించి నిర్మల్ జిల్లాకు చెందిన స్నేహితుల ద్వారా తెలుసుకున్నాం. ఇక్కడి అందాలను తిలకించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. జలపాతం జలధారలను దూరం నుంచే చూసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దగ్గరకు వెళ్లనిస్తే బాగుండేది.

రోప్‌వే నిర్మిస్తే బాగుంటుంది..



మహేందర్ సింగ్ కుటుంబ సభ్యులు, నిర్మల్

నేరడిగొండ: కుంటాల జలపాతం తిలకించేందుకు రోప్‌వే నిర్మిస్తే బాగుంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మెట్లు దిగి, ఎక్కాలంటే అవస్థలు పడాల్సి వస్తుంది.రోప్‌వే నిర్మిస్తే పైనుంచే జలపాతం అందాలను వీక్షించేందుకు అవకాశం ఉంటుంది.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా



సహస్రకుండ్ జలపాతం వద్ద నిర్మించిన రోప్‌వే

నేరడిగొండ: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పరిధిలో గల ఇస్లాపూర్‌లోని సహస్రకుండ్(సాసర్‌కుండ్) జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. వారిని దృష్టిలో పెట్టుకుని అక్కడి ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది. ఈ జలపాతం నిర్మల్ జిల్లా నుంచి 50 కి.మీ దూరంలో ఉంది. కిన్వట్, బోథ్ తాలుకాలు పక్కపక్కనే ఉంటాయి. మన కుంటాల జలపాతం వద్ద తెలంగాణ ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టలేదు. గతంలో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది చనిపోయినా అధికార యంత్రాంగం పాఠాలు నేర్వలేదు. కాగా, కుంటాల జలపాతం అభివృద్ధికి రూ.3 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు టూరిజం శాఖ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు.



కుంటాల జలపాతం వద్ద రక్షణ లేని ప్రదేశంలో పర్యాటకులు

జలపాతం బాగుంది..



వర్షం నీటితో పాటు సహజసిద్ధంగా ఈ జలపాతం ఉండడంతో చాలా బాగుంది. 'సాక్షి', సోషల్ మీడియాలో చూసి జలపాతాన్ని చూసేందుకు కుటుంబ సభ్యులతో వచ్చాం. ఇక్కడికి వచ్చాక జలపాతాన్ని చూసి ఎంజాయ్ చేశాం.

– నిఖిత, సందర్శకురాలు, మంచిర్యాల

జలపాతం అందాలు మైమరిపిస్తున్నాయి



ఓర్స సవిత చంద్రశేఖర్ యాదవ్, కుమారి ఎంపీటీసీ

కుంటాల జలపాతం అందాలు మైమరిపిస్తున్నాయి. మెట్ల ద్వారా కిందకు దిగేటప్పుడు అవస్థలు ఎదురవుతున్నాయి. మెట్లు దెబ్బతిన్నాయి. జలపాతం కింది భాగంలో మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలోని మందమర్రి మండలంలోని అందుగలపేట గ్రామానికి ఐదారు కిలో మీటర్ల దూరంలో క్షీర జలపాతం ఉండడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ప్రభుత్వం ఈ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి సందర్శకుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలి. అలాగే జలపాతం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హెచ్చరిక బోర్డులతో పాటు తగు చర్యలు తీసుకోవాలి.

- కొండపర్తి సందీప్, అందుగులపేట గ్రామస్తుడు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



అందుగులపేట సమీపంలో..

మందమర్రిరూరల్: అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలో జలపాతం ఉందని మిత్రులు చెప్పడంతో చూడడానికి వచ్చాం. అందుగులపేట గ్రామం నుంచి దారి ఉందని వెళ్లితే రాళ్లవాగుపై ఉన్న వంతెన కూలిపోవడంతో మళ్లీ సుమారు ఎనిమిది కిలో మీటర్లు వెనక్కి వచ్చి బొక్కలగుట్ట గ్రామంలోని రోడ్డు గుండా క్షీర జలపాతం చేరుకున్నాం.

– పొన్నాల రాజు, మంచిర్యాల

దగ్గరలోనే జలపాతం..



అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు పాల నురుగులా కొండ పై నుంచి జాలువారుతూ చూడ ముచ్చటగా ఉన్న అందమైన ఈ జలపాతం మంచిర్యాలకు దగ్గరలోనే ఉంది. ఇన్నాళ్లు ఎవరికీ తెలియకుండా ఇప్పుడు దీనికి ప్రాచుర్యం లభిస్తోంది. – దేవులపల్లి శ్రావ్య, సందర్శకురాలు, మంచిర్యాల

మాలో జోష్ పెంచింది..



విశేషంగా ఉన్న ఈ జలపాతం సందర్శించడమే కాదు జలపాతం నీటిలో తడుస్తూ చేసిన ఎంజాయ్ మాలో చాలా జోష్ పెంచింది. జలపాతం గురించి తెలియగానే వెంటనే వచ్చేశాం. జలపాతం అందాలు మమ్మల్ని కట్టిపడేశాయి.

– మహ్మద్‌అలీ, సందర్శకుడు, మంచిర్యాల

అభివృద్ధి చేయాలి



ఈ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. మూడేళ్ల కిందట యువకులు షార్ట్ ఫిల్మ్ తీయడంతో తెలిసింది. ఇటీవల 'సాక్షి' దినపత్రికతో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పర్యాటకుల సంఖ్య పెరిగింది.

– కనగర్తి మురళీధర్, ర్యాలీ గ్రామస్తుడు

కాలినడకన వెళ్లాం..



గుండాల జలపాతం చూసేందుకు రోంపెల్లి గ్రామం నుంచి దాదాపు ఆరు కిలో మీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాం. ఇంత అందమైనా జలపాతం ఉన్న కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం.. కనీస వసతులు కల్పిస్తే అభివృద్ధి చెందుతుంది.

– ఓరగంటి రవీందర్, గోలేటి (రెబ్బెన)

చాలా బాగుంది..



చింతలమాదర జలపాతం ఎంతో బాగుంది. పైనుంచి పాల మాదిరిగా నీళ్లు కిందికి జారుతుండటం పర్యాటకులను ఎంతో కనువిందు చేస్తుంది. కానీ జలపాతం వద్ద కనీసం మంచినీటి సౌకర్యం అయినా అధికారులు కల్పిస్తే బాగుటుంది.

– తిరుపతి, సుంగాపూర్(తిర్యాణి)

గౌడ కులస్తులకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలి

- మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్
- జిల్లా కేంద్రంలో గౌడజన హక్కుల మోకు దెబ్బ మహాసభ



మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

పాతమంచిర్యాల: గౌడ కులస్తులకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జేఏసీ చైర్మన్, మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల గౌడ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. గౌడ కులస్తులకు వారి జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో అవకాశం కల్పించాలని, కల్లును మత్తు పానీయాల జాబితా నుంచి తొలగించాలన్నారు. కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించి కల్లుగీత వృత్తిని అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాకు ఒక నీరా ప్రాజెక్టును ప్రారంభించాలని తెలిపారు. ఆగస్టు రెండో వారంలో నిర్మల్ జిల్లాలో నిర్వహించే మోకు దెబ్బ రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సందర్భంగా పెద్దపల్లి మంచిర్యాల జిల్లాకు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్దిరాములు గౌడ్, ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్‌గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి బాలసాని సురేష్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరీ ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి భూసారపు మొండి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు, తెలంగాణ గౌడ జన హక్కుల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాగుల కిరణ్, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు నగునూరి నీరజ, రాష్ట్ర నాయకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, బీముని శ్రీనివాస్, బిందే నాగభూషణం, జిల్లా మోకు దెబ్బ అధ్యక్షులు బలసాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

యాదవులకు రిజర్వేషన్ కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నగేశ్‌యాదవ్

శ్రీరాంపూర్: జనాభా ప్రకారం యాదవులకు విద్యా, ఉద్యోగాలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో యాదవుల ఆత్మగౌరవం, అభివృద్ధి, అధికారం, రిజర్వేషన్లపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి దామాషా పద్ధతిలో యాదవులకు రావాల్సిన అన్ని రకాల హక్కులు, వాటా కల్పించాలన్నారు. అన్ని పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యేల టికెట్లు ఇవ్వాలన్నారు. గొర్ల కాపర్లకు 559, 1016 జీఓ అమలు చేసి ఇన్సురెన్సు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. యాదవులకు 1970 వరకు అమల్లో ఉన్న సెమీ నోమాడిక్ ట్రైబ్స్ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రూ.10 వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలను అన్ని రాజకీయ పార్టీలు తమ మెనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం యాదవులంతా పార్టీలకు అతీతంగా పోరాడాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా నాయకులు అరిగెల పద్మయాదవ్, గొర్రె తిరుపతియాదవ్, సందెవెని సతీశ్‌యాదవ్, పురుషోత్తం, గంగన్న, చెలుకల మల్లేశ్‌యాదవ్, కాల్వ శ్రీనివాస్, మేకల సమ్మయ్య, దండు మల్లయ్య, ముస్కె రవి, అజయ్, సిద్ధి సంపత్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఒకరి మృతి



పల్లంకొండ సురేశ్ (ఫైల్)

నస్పూర్: ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి ఒకరు మృతిచెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం సీసీసీ నస్పూర్ అదనపు ఎస్సై సంతోష్ వివరాల ప్రకారం... సీసీసీకి చెందిన పల్లంకొండ సురేశ్(28) పట్టణ పరిధి ఫ్లడ్ కాలనీలోని మార్టిన్ గ్రామర్ స్కూల్‌లో సెప్టిక్ ట్యాంకును సెప్టిక్ ట్యాంకు క్లీనర్ వెహికిల్‌తో క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో జారి పడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య శిరీష ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

సీఆర్‌ఆర్ మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాణిక్‌రావు ఠాక్రే

- రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి(సీఆర్‌ఆర్) మృతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మావల మండల కేంద్రంలో చిల్కూరి లక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం రామచంద్రారెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎవరెంటే సీఆర్‌ఆర్ పేరు గుర్తుకు వచ్చేదన్నారు. ప్రజలకు ఎప్పుడు సేవ చేయాలని తపించే వ్యక్తి సీఆర్‌ఆర్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు అండగా ఉంటారన్నారు. విద్యార్థి దశలో ఉన్న సమయంలో తాను చదువుకుంటున్న పాఠశాలకు సీఆర్‌ఆర్ వచ్చారని ఎమ్మెల్యే జోగు రామన్న గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, నడిపెల్లి దివాకర్ రావు, మాజీ ఎంపీ గోడం నగేశ్, రాష్ట్ర మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రంగినేని మనీష పవన్ రావు ఉన్నారు.

'రాంచంద్రారెడ్డి మిత్రుడే'

రాంచంద్రారెడ్డి తనకు మిత్రుడని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. అందరి సంక్షేమాన్ని కోరే వ్యక్తి సీఆర్‌ఆర్ అని కొనియాడారు. పార్టీ పరంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రెటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే విశ్వనాథ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సుజాత, వెడ్మ బొజ్జు, మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, నర్సయ్య, చారులత రాథోడ్, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి ఉన్నారు.